


## ముందుమాట- నా మాట

ఆకాశానికి హద్దులు లేనట్టే సాగరానికీ హద్దులు లేవు. మనిషి తన సంకుచితత్వంతో సాగరంలో హద్దులు గీయాలని ప్రయత్నించినా సముద్రజలం ఆ సరిహద్దులను గుర్తించదు, మన్నించదు. సాహిత్యం కూడా సాగరం లాంటిదే. మానవజీవితాన్ని అక్షరరూపంలో ప్రతిబింబించే సాహిత్యంలో సార్వజనీనత వుంటుంది. దానికి ప్రపంచంలోని ఏమూలనున్న మనిషి హృదయమైనా స్పందిస్తుంది. కానీ, తనకలవాటైన సంకుచితత్వంతో మనిషి సాహిత్యంలోకూడా అడ్డుగోడలు నిర్మించాలని చూస్తాడు. ఇది ఇతర భాషల సాహిత్యంలోకన్నా తెలుగు సాహిత్యంలో అధికంగా కనిపిస్తుంది.

సాహిత్యం అన్నది సున్నిత మనస్కుడి హృదయస్పందనకు అక్షరరూపం. ఒకే రకమైన అనుభవం వ్యక్తులలో విభిన్నమైన స్పందనలు కలిగిస్తుంది. మామూలు వ్యక్తులకు ఆ స్పందన రూపం అవగాహనకు రాదు. వారి దృష్టి స్పందన వల్ల కలిగిన భావ తీవ్రత స్వరూపాన్ని అనుభవించడంపైనే వుంటుంది. కానీ, రచయిత ఆ భావ తీవ్రత స్వరూపాన్ని అర్థంచేసుకోవాలని తపన పడతాడు. ఆ తపన ఫలితాన్ని అక్షరరూపంలో ప్రదర్శిస్తాడు. అంటే, తనలోకి తాను చూసుకున్న రచయిత, తనదయిన రీతిలో ప్రపంచ స్వరూపాన్ని అర్థం చేసుకుని , దాన్ని అక్షరరూపంలో ప్రపంచానికి అందిస్తాడన్నమాట. ఇది చదివిన పాఠకులు తమ సందిగ్ధాలకూ, సందేహాలకూ సమాధానాలను పొందుతారు. ఇది వారికి తమ చుట్టూ వున్న సమాజంపట్ల అవగాహన కలిగించటమే కాదు, మదిలో ఒక అద్భుతమైన భావనను కలిగిస్తుంది. ఆలోచనలను కలిగిస్తుంది. ప్రధానంగా కథపట్ల పాఠకులు ఇందువల్ల ఆకర్షితులౌతారు.

కథ పాఠకుల ఊహలకు రెక్కలనిస్తుంది. ఆలోచనలను పదును పెడుతుంది. తమని తాము అర్థంచేసుకునే వీలు కల్పిస్తుంది. తమ జీవితాలను అర్థం చేసుకునే శక్తిని ఇస్తుంది. జీవితంలో పోరాటాలను ఎదుర్కొనే స్ఫూర్తినిస్తుంది. ప్రధానంగా కథ, అందరి అనుభవాలకు వచ్చే విషయాలనే ఒక నూత్నకోణంలో ప్రదర్శిస్తుంది. అది చదివిన పాఠకుడు "ఈ విషయాన్ని ఇలా కూడా అర్థం చేసుకోవచ్చా?" అని విస్తుపోతాడు. "ఈ అంశాన్ని ఇలాకూడా చూడవచ్చా" అన్న విభ్రమానికి గురౌతాడు. ఇది పాఠకుడిని కథవైపు పదే పదే ఆకర్షిస్తుంది. అందుకే, రచయిత బ్రహ్మవంటి వాడు. సృష్టికారుడి సృష్టిని తన కోణంలోంచి చూసి, అనుభవించి, విశ్లేషించి, ప్రతిసృష్టి చేస్తాడు రచయిత. బ్రహ్మసృష్టిని కల్పనగా భావించలేని మనసు సృష్టిలోని సుఖదుఃఖాలకు స్పందిస్తుంది. కానీ, రచయిత సృష్టి కల్పన అని తెలుసు. అయినా రచయిత సృజించిన కాల్పనిక ప్రపంచంలోని వ్యక్తుల అనుభూతులతో పాఠకుడూ లయిస్తాడు. కాబట్టి, రచయిత బ్రహ్మకన్నా ఒక మెట్టు పైనుంటాడు. ఎందుకంటే, రచయిత సృజనాత్మకత వల్ల అక్షరాలే దృశ్యాలై, భావాలే శబ్దాలై, మనస్సే రంగస్థలమై , కాల్పనిక ప్రపంచం సత్యమై పాఠకుడిని ఉర్రూతలూగిస్తుంది.

అందుకే, ప్రతి రచయితా తన పరిధిలో, విశ్వ సృష్టికారుడి సృష్టిలోని ఒక అంశాన్ని ప్రదర్శిస్తాడు. ఏ రచయితా కూడా తన అనుభవ పరిధిని దాటి రచన చేయలేడు. అలా చేసినా, ఆ రచన పాఠకుడిని స్పందింపచేయలేదు. ఎందుకంటే పాఠకుడు తనకు పరిచయమైన అంశాలకే స్పందిస్తాడు. తన అనుభవానికి రాని, ఊహింపలేని అంశాలకు స్పందించడు. ఇలాంటపుడు రచయిత, అనుభవం లేని విషయాలను , పాఠకులకు అనుభవం వున్న అంశాలతో పోల్చి, తాను ప్రదర్శించదలుచుకున్న అంశాన్ని పాఠకుడి మనస్సుకు చేరువ చేస్తాడు.

అయితే, ఇతర సాహిత్యాలకు భిన్నంగా, తెలుగులో రచయితపై అనేక పరిమితులు విధించారు. సాహిత్యమహాసాగరంలో రకరకాల అడ్డుగోడలు నిర్మించాలని ప్రయత్నిస్తున్నారు. కులం, భాష, ప్రాంతం, ఆదర్శం వంటి అనేక అంశాల ఆధారంగా కథను చట్రంలో బిగించి ఊపిరి అందనీయకుండా చేస్తున్నారు. సూర్యుడి కిరణ దిశని నిర్దేశించి, దాని విస్తృతిని గుప్పెట్లో బంధించాలని ప్రయత్నిస్తున్నారు.

రచయిత ఒక భావావేశ స్థితిలో రచన చేస్తాడు. తన రచనద్వారా పాఠకుడిని తన భావావేశ సముద్రంలో ఓలలాడిస్తాడు. తన స్థాయికి ఎదిగిస్తాడు. అయితే, పాఠకుడికి, రచయిత రచన గురించి సరైన అవగాహన కల్పించి, పాఠకుడికి, రచయితకు నడుమ వారధిలా వ్యవహరిస్తాడు విమర్శకుడు. అంటే, విమర్శకుడు రచయితలా స్వయంగా సృజించలేకపోయినా, రచయితలా భావనా బలం కలవాడయి ఉండాలి. రచయిత భావావేశాన్ని గ్రహించి, పాఠకుడికి వివరించగలిగే భావనాపటిమ కలవాడై ఉండాలి.

మరోరకంగా చెప్పాలంటే రచయిత సూర్యుడివంటి వాడు. స్వయం ప్రకాశకుడు. విమర్శకుడు చంద్రుడివంటి వాడు. రచయితనుండి వెలుతురుని గ్రహించి, దానిలోని వాడి, వేడిని గ్రహించి, చల్లదనాన్ని ప్రపంచానికి పంచేవాడు. రచయిత తీవ్రతను తగ్గించి, చల్లని వెలుగులను అందించేవాడు విమర్శకుడు. కానీ, అనేక కారణాలవల్ల తెలుగు సాహిత్యరంగంలో విమర్శకులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించటంలేదు. నిష్పక్షపాతంగా వుండవలసిన విమర్శకులు కళకు రంగుటద్దాలు కట్టుకున్నారు.
ఆ రంగుటద్దాల్లోంచి, సాహిత్యాన్నిచూసి విమర్శిస్తున్నారు.

దాంతో, అనంతమైన కథా సాగరంలో అనేకమైన అడ్డుగోడలు వెలిసే పరిస్థితి తెలుగు సాహిత్యంలో నెలకొంది. కథ వస్తువు, శైలి వంటి విషయాల చట్రంలో కథని బిగిస్తున్నారు. మానవజీవితంలో లేని అపరిమితత్వాన్ని కథలకు ఆపాదిస్తున్నారు. కథకుడి చుట్టూ కంచెలు నిర్మిస్తున్నారు. కోటలుకట్టి సైనికులను కాపలా పెడుతున్నారు. దాంతో, సాహిత్యం తన విస్తృతిని కోల్పోవలసిన పరిస్థితివస్తోంది.

రచయిత, ప్రపంచాన్ని అర్థంచేసుకోవడంలో ఎంత తెలివిని ప్రదర్శించినా, ఇతర విషయాలలో అమాయకుడు. తన స్పందనకు అక్షరరూపం ఇస్తాడు. విమర్శకులు, ఇతరులు, తమ సంకుచిత ప్రామాణికాల కొలబద్దలతో ఆ రచనను చూసి తిరస్కరిస్తారు. ఉదాసీనంగా ఉండిపోతారు. దాంతో, తన రచనలు పదిమందికీ చేరాలన్న ఆత్రంలో, రచయిత తన స్పందన రూపాన్ని విస్మరించి, ఏదైతే "మెప్పు" పొందేవీలుందో, ఏదైతే ప్రచురణ అవుతుందో, అలాంటి రచనలు చేసేందుకు తపనపడతాడు. దాంతో, ఒక పద్ధతి ప్రకారం రచయితలు ఎలాంటి రచనలు చేయాలో, ఎలాంటి రచనలు చేస్తే గుర్తింపు వస్తుందో, ఎలాంటివి మంచి రచనలో, ఓ అభిప్రాయాన్ని తెలుగు సాహిత్యరంగంలో స్థిరపరిచేసారన్నమాట. ఇందువల్ల ఒకేరకమైన కథలు, ఒకే రకమైన ఆలోచనలు, ప్రదర్శించే గుప్పెడుమంది రచయితలే తెలుగు సాహిత్యంలో ప్రామాణిక రచయితలు.గా మిగిలిపోయారు. మరో గుప్పెడు మంది రచయితలు "గొప్ప" రచయితలుగా చలామణీ అవుతున్నారు. ఇందువల్ల రెండు దుష్పరిణామాలు సంభవించాయి.

తమ మనస్సు స్పందనను అనుసరించి రచనలుచేసేవారు నిరాశకు గురయ్యారు. గుర్తింపు, పొగడ్తలు లేక వారి రచనలు విస్మృతిలో పడడంతో, నిస్పృహతో వారు ఆమోదం పొందే రచనలవైపు కసిగా మళ్ళారు. లేకపోతే, రచనలు వదిలేసారు.

మరో పరిణామం ఏమిటంటే, సాహిత్యంనుంచి పాఠకులు విముఖులయ్యారు. పాఠకుల హృదయస్పందనలను అక్షరరూపంలో ప్రదర్శించే సాహిత్యం వారు మెచ్చుతారు, ఆదరిస్తారు, దాచుకుంటారు. కానీ, "ఇలాంటివే మంచికథలు, ఇలాంటి వాటినే మీరు ఆదరించాలి" అని ఒక పద్ధతి ప్రకారం ఒకే భావజాల ప్రాధాన్యం కల రచనలను పాఠకులపై రుద్దడంతో, తమ సందేహాలకు, ఆందోళనలకు పరిష్కారాలు సాహిత్యంలో దొరకక పాఠకులు సాహిత్యంనుండి విముఖులయ్యారు, సాహిత్యానికి దూరమయ్యారు.

రచయితకు తప్పదు కాబట్టి తలవంచుతాడు. కానీ పాఠకులు నిరంకుశులు. వారు తమకు నచ్చని వాటిని నిర్మొహమాటంగా పక్కకు నెట్టేస్తారు. ఇందువల్ల విమర్శకులు, వారికి తగ్గట్టు రాసేవారి అహాలు తృప్తి పొందుతున్నాయి. కానీ, పాఠకులు దూరమైపోతున్నారు. అందుకే, తెలుగు సాహిత్యంలో విమర్శకులు అతిగొప్పగా పొగిడిన కథలు పాఠకులను స్పందించలేకపోతున్నాయి. ఆ రచయితలు వారి కథలతోపాటు అదృశ్యమైపోతున్నారు. విమర్శకులు, వందిమాగధులు వారిని సజీవంగా ఉంచుతున్నా, పాఠకులు వారిని పట్టించుకోవటంలేదు. ఇందువల్ల కాల్పనిక సాహిత్యంతో తాదాత్మ్యం చెందలేని పాఠకుడు, కాల్పనికేతర సాహిత్యంవైపు పరుగులిడుతున్నాడు. తన సంఘర్షణలకు, సందేహాలకు సమాధానాలను కాల్పనికేతర సాహిత్యంలో వెతుక్కుంటున్నాడు. ఇది అర్థం చేసుకోలేని విమర్శకులు పాఠకులలో చదివే అలవాటు తగ్గుతోందని వాపోతున్నారు తప్ప, వారిని రచనలవైపు ఆకర్షించే లక్షణం, రచనలలో పోతోందని గ్రహించటంలేదు. అది గ్రహిస్తే, వారు "ఉత్తమం"గా ప్రచారం చేస్తున్న సాహిత్యం పాఠకులకు పనికిరానిదిగా ఒప్పుకోవాల్సివస్తుంది.

ఇలా తమకు నచ్చినవారినో, పరిచయాలున్న వారినో పొగడటంవల్ల, తమకు లాభాలున్నవారిని ఆకాశాని కెత్తేస్తూండటంవల్ల, తెలుగుసాహిత్యం అల్లకల్లోలమౌతోంది. విమర్శకులు ముఠాలుగా ఏర్పడి, ఒకో ముఠా కొందరు రచయితలకు కొమ్ము కాస్తూ, వారికే పెద్దపీటలు వేస్తున్నారు. వారి కథలనే ఉత్తమ కథలుగా నిర్ణయించి, తమ సంకలనాలలో అలాంటి కథలనే ఎంచుకుంటున్నారు.

ఇలా ఒక పద్ధతి ప్రకారం తమ వారిని, వారు రాసిన కథలను మాత్రమే విమర్శక ముఠాలు సజీవంగా ఉంచుతూండడంతో నిజంగా మంచి కథలు రాసే కథకులు మరుగున పడుతున్నారు. వారి కథలు పత్రికల పేజీలలో అజ్ఞాతంగా వుండిపోతున్నాయి.

ఇటువంటి పరిస్థితులలో కథని నిష్పాక్షికంగా విమర్శించాల్సిన అవసరం వుంది. రచయిత పేరుతో, రచయిత భావజాలంతో, రచనలో ప్రదర్శించే వస్తువులతో, సంబంధం లేకుండా, రచనను రచనలాచూసి విమర్శించాల్సిన అవసరం ఎంతోఉంది. ఆ అవసరం ఈ "కథాసాగరమథనం" శీర్షిక ద్వారా తీర్చాలని ఈ చిన్ని ప్రయత్నాన్ని ఆరంభిస్తున్నాను

ఈ శీర్షికన నెలనెలా విభిన్న దినపత్రికల ఆదివారం అనుబంధాలు, వారపత్రికలు, మాసపత్రికలలో ప్రచురితమైన కథలను విశ్లేషించడం, జరుగుతుంది. ఈ విశ్లేషణలో ఎలాంటి పక్షపాతం చూపటం వుండదు. కథను కథగా, సరస్వతీదేవికి రచయిత అర్పించే నీరాజనంగానే పరిగణించటం ఉంటుంది. కథలోని సార్వజనీనత, దీర్ఘకాలిక ప్రయోజనాలు, అది సాధించే ఫలితాలపైనే దృష్టి తప్ప మరోవిషయాన్ని పరిగణనలోకి తీసుకోవడం జరగదు. అంటే, కథను కథగా మాత్రమే చూడడం జరుగుతుందన్నమాట.

సాహిత్యం సరస్వతీ రూపం. సరస్వతీదేవిలో "కన్ను నాది, కాలివేలు నీది" అన్నట్టు పరిమితులు విధించడం, పరిధులు గీయడం మూర్ఖత్వమే కాదు నైచ్యం కూడా. పరిధులను విస్మరించి, విశాల సాగరమథనానికి ఇదే ఆరంభం. ఈ సాగరమథనంలో జనించే హాలాహలాన్ని భరించి, అమృతాన్ని పాఠకులకుపంచి ఇచ్చే ప్రయత్నం జరుగుతుంది ఈ శీర్షికన. ఈ శీర్షికద్వారా, అజ్ఞాతంలో మిగిలిపోతూ, అద్భుత రచనలు చేస్తున్న రచయితలూ , వారి రచనలు పరిచయం చేయటం వుంటుంది. పాఠకులు స్వయంగా రచనలను చదివి వాటి నిగ్గుతేల్చుకునే వీలుంటుంది.

కులం, ప్రాంతం, స్నేహం, స్వార్థాల ఆధారంగా కొద్ది కథకులూ, కథలను మాత్రమే పొగిడి ప్రచారం చేస్తున్నవారి ఆటలను పాఠకులు అర్థం చేసుకుని, నిజాలను గ్రహించే వీలును ఈ శీర్షిక కల్పిస్తోంది.

పాఠకులు నిర్మొహమాటంగా, నిరభ్యంతరంగా తమ అభిప్రాయాలను తెలపాలి. మనందరం కలిసి చేసే ఈ సాగర మథనం ద్వారా అమృతాన్ని భావితరాలకు అందించాలి. సాహిత్య సాగర ప్రవాహ వేగం వల్ల కృత్రిమ నిర్మిత అడ్డుగోడలు కరిగిపోవాలి.

ఆనో భద్రః క్రతవో యంతు విశ్వతః

అన్నివైపులనుండీ, ఉన్నతమైన ఆలోచనలకిదే మా ఆహ్వానం.

గమనిక: ఎవరైనా రచయితలు తమ కథలను నా దృష్టికి తేవాలనుకుంటే, కథలను ఈమెయిలు చేయవచ్చు. కథాసంకలనాలను పంపవచ్చు.

(K. Murali Krishna)
kmkp2025@gmail.com
9849617392

కస్తూరి మురళీకృష్ణ గారు తెలుగు సాహిత్యంలో ఉన్న వీలైనన్ని ప్రక్రియలలో రచనలు చేయాలని ప్రయత్నిస్తున్నారు. విభిన్నాంశాల ఆధారంగా రచనలు చేస్తున్నారు. 1995 లో ఆంధ్రప్రభ దీపావళి నవలల పోటీలో 'అంతర్యాగం' నవలకు ద్వితీయ బహుమతి, 1990లో ఆంధ్రభూమి సస్పెన్స్ నవలల పోటీలో 'ఆపరేషన్ బద్ర్' నవలకు ప్రత్యేక బహుమతి వచ్చింది. అసిధార, అంతర్మథనం, మర్మయోగం నవలలు పుస్తకరూపంలో వచ్చాయి. జీవితం-జాతకం, 4 X 5, రాజతరంగిణి కథలు వంటి సంకలనాలు కూడా పుస్తకరూపంలో వచ్చాయి. భరతీయ తత్వచింతన, మన ప్రధాన మంత్రులు, మన ముఖ్యమంత్రులు, 1857 - మనం మరవకూడని మహాయుద్ధం - ఇవి పుస్తకరూపంలో వచ్చిన కాల్పనికేతర రచనలు.

ఇంకా దాదాపు అరడజను పైగా పత్రికలలో రెగ్యులర్ కాలమ్స్ నిర్వహిస్తున్నారు.

వీరి బ్లాగులు: www.kasturimuralikrishna.wordpress.com
http://muralischocolatefactory.blogspot.com/